సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు

కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాట్ల మధు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11: బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టిన అధికారులు, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. సదరు నాయకులు జిల్లా అధికారుల గురించి ఇష్టానుసారంగా మాట్లాడారని చెప్పారు. అలాంటి వారిపై ఎలాంటి చర్యలు లేవన్నారు. స్వయంగా తనపైనే అక్రమ కేసు పెట్టారని గుర్తు చేశారు. కటకం మృత్యుంజయం, కేకే మహేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోపోతే రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిరసనలు చేపడుతామన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేత జిందం చక్రపాణికి సంబంధించిన బార్‌ను కక్షపూరిత చర్యలో భాగంగానే మూసివేయించారని ఆరోపించారు. అక్రమ అరెస్టులు చేసిన అధికారులకు.. కాంగ్రెస్ నాయకుల వసూళ్ల పర్వం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రేషన్ దుకాణాల్లోనూ డబ్బులు వసూళ్లు చేశారని ఆరోపించారు. అధికార పార్టీకి ఓ న్యాయం, ఇతరులకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు విచ్చలవిడిగా ప్రవరిస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్న వసూళ్ల పర్వానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు బయటపెడుతామని స్పష్టంచేశారు. సమావేశంలో కొయ్య డ రమేశ్, చిలువేరు చిరంజీవి, ఇమ్మనేని అమర్‌రావు, కంచర్ల రవిగౌడ్, గుండు ప్రేమ్‌కుమార్, కుర్మ రాజయ్య, ఆత్మకూరు చంటి, నీరటి బాబు, బండి జగన్, బండి దేవేందర్‌యాదవ్, సయ్యద్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

బాధిత కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి11: అధైర్యపడొద్దు.. అన్నివిధాల అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకులు భరోసానిచ్చారు. ఆవునూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బత్తుల మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృ తి చెందగా, అతడికి పార్టీ తరపున మంజూరైన ₹2లక్షల బీమా చెక్కును మంగళవారం పార్టీ నేతలు అందజేశారు. ఇక్కడ పార్టీ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు పొన్నాల పద్మారెడ్డి, సీనియర్ నేతలు కనమేని పద్మారెడ్డి, నక్కదాసరి రవి, పీఏసీఎస్ డైరెక్టర్ సతీశ్‌చందర్‌రావు, రామలక్ష్మణపల్లి మాజీ సర్పంచ్ దమ్మ రవీందర్‌రెడ్డి, నాయకులు కుంబాల మల్లారెడ్డి, బోయిని రవి, గంగడి మల్లారెడ్డి, జక్కుల యాదగిరి, డాక్టర్ చందు, బోయిని భిక్షపతి, బత్తుల భాస్కర్, రొడ్డ దేవదాసు, పిట్ల చంద్రయ్య, జక్కుల నర్సింహులు, ఎండీ నజీర్, బత్తుల శ్రవణ్, సోషల్ మీడియా వారియర్స్ దాసరి విశ్వనాథం పరిధిపేట వెంకటేశ్, తదదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి జాతర విధులు బదిలీ ఉద్యోగులకు ..

వేములవాడ, ఫిబ్రవరి 11: వేములవాడ రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తించి .. ఇతర ఆలయాలకు బదిలీ అయిన ఉద్యోగులకు మహాశివరాత్రి జాతర విధులను రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు కేటాయించనున్నారు. మహాశివరాత్రి వేడుకలు ఈ నెల 25వ నుంచి 27వరకు రాజన్న ఆలయంలో నిర్వహించనున్నారు. ఆలయంలో ప్రస్తుతం ఉద్యోగుల కొరత, ఇక్కడ విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు అనుభవం ఉన్నందున ఈ నెల 24 నుంచి 27వరకు నాలుగు రోజులపాటు విధులు నిర్వర్తించే విధంగా దేవాదాయశాఖ ఎనిమిది మంది ఉద్యోగులకు విధులు కేటాయించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట, కొండగట్టు ఆలయాలకు బదిలీ అయిన ఉద్యోగులకు జాతర విధులను కేటాయించనున్నట్లు సమాచారం.

అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట రూరల్, ఫిబ్రవరి11: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి సూచించారు. ఇల్లంతకుంట మండలం ఓబులాపూర్ గ్రామంలో మంగళవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, యువత గంజాయికి బానిస కావొద్దన్నారు. ఆపద సమయాల్లో తప్పనిసరిగా డయల్100కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఇక్కడ ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, వీపీవో రామంచ తిరుపతి ఉన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ పత్రి కనుకవ్వ, W/o వెంకటి, R/o. మల్లారెడ్డిపేట గ్రామం, గంభీరావుపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క విస్తీర్ణం: 181.50 చ.గజాలు, దీని యొక్క సర్వేనెంబరు 53/1, సర్ధాపూర్, సిరిసిల్ల పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 11-02-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ మహమ్మద్ బాబు, S/o మహమ్మద్ మధర్, R/o. గొల్లపల్లి గ్రామం, ఎల్లారెడ్డిపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క విస్తీర్ణం: 158.51 చ.గజాలు , దీని యొక్క సర్వేనెంబరు 422a/B/A/1/1, H.No. 7-62, దగ్గర బైపాస్ రోడ్, గొల్లపల్లి గ్రామం, ఎల్లారెడ్డిపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 11-02-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11: మున్సిపల్ ఉద్యోగులం.. అంటూ ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని ఎవరైనా మొబైల్ నంబర్ 8106026047 నుంచి ఫోన్ చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు యజమానులు ఇలాంటి వారికి డబ్బులు ఇవ్వరాదని, కేవలం అధికారిక ఆన్‌లైన్ వెబ్‌సైట్స్ లేదా పురపాలక సంఘం కార్యాలయంలో మాత్రమే ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. ఇలాంటి వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ, ఫిబ్రవరి 11: వేములవాడ సబ్‌స్టేషన్ ఏడాది నిర్వహణలో భాగంగా బుధవారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని సెస్ ఏఈ సిద్ధార్థ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతు నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

కోనరావుపేట, ఫిబ్రవరి 11: నిమ్మపల్లికి చెందిన ఇస్లావత్ మోహన్‌నాయక్‌ను సిలిండర్లు దొంగతనం కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన ముడారి పోశెట్టి తన ఇంటి వెనుకాల ట్రాలీలో రెండు ఖాళీ సిలిండర్లు ఉండగా, రాత్రి సమయంలో ఇస్లావత్ మోహన్‌నాయక్ ఎత్తుకెళ్లాడు. ఈ క్రమంలో గమనించిన పోశెట్టి సదరు వ్యక్తిని వెంబడించి అడ్డుకోగా ద్విచక్ర వాహనం, ఖాళీ సిలిండర్లు వదిలిపెట్టి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన ఎస్ఐ ఇస్లావత్ నాయక్‌ను పట్టుకుని విచారించగా, కరీంనగర్ బస్టాండ్‌లో హెచ్‌ఎఫ్ డీలక్స్ అనే బైక్‌ను దొంగతనం చేసి, ఆదే బైక్‌పై సిలిండర్లను ఎత్తుకెళ్తున్నట్లు ఒప్పుకొన్నాడు. వెంటనే సదరు వ్యక్తి వద్ద ఉన్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సిలిండర్లను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కమ్యూనిటీ భవనం..
కళావిహీనం

తలుపులు, కిటికీలు, ఎత్తుకుపోవడంతో కళావిహీనంగా మారిన కమ్యూనిటీ భవనం

- నాడు శుభకార్యాలు.. నేడు అసాంఘిక కార్యకలాపాలు
- అధికారుల నిర్లక్ష్యంతో మందుబాబులకు అడ్డా
- ఆందోళనలో కాలనీవాసులు
- వినియోగంలోకి తేవాలని డిమాండ్

చెత్తాచెదారంతో నిండిపోయిన కమ్యూనిటీ భవన సముదాయం

దుండగుల దాడిలో ధ్వంసమైన మరుగుదొడ్డి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : స్వశక్తి సంఘ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా ప్రతి వార్డుకో కమ్యూనిటీ భవనం నిర్మించింది. భవనంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు వివిధ శుభకార్యాలు జరుపుకొనేలా ఆధునాతన సౌకర్యాలు కల్పించింది. పేదలకు అతి తక్కువ ధరకే కార్యక్రమాలు జరుపుకొనేలా చేయూతనిచ్చింది. దాంతో మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా కమ్యూనిటీ భవనాల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చేసింది. అలాంటి కమ్యూనిటీ భవనం నేడు ఆలనా పాలన చూసే వారు లేక నిర్వహణ లోపంతో కళావిహీనమైంది.

₹ లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు!

జిల్లా కేంద్రంలోని వెంకంపేట, సుందరయ్యనగర్ కాలనీల మధ్యన మోడ్రన్ దోబీఘాట్ వద్ద వెంకంపేట వార్డుకు చెందిన మహిళా సంఘాల కోసం అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని ఆధ్వర్యంలో ₹25లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మించారు. 24 జూన్2019లో వినియోగంలోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా వెంకంపేట, సుందరయ్యనగర్‌లోని నేతన్నల కుటుంబాలకు అనుకూలంగా ఉంటుందని భావించి మాజీ మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేశారు. నాలుగేళ్ల పాటు అనేక కార్యక్రమాలు జరిగాయి. నేతన్నల కుటుంబాలతోపాటు పేద ప్రజలందరూ ఈ కమ్యూనిటీ భవనాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రజలు శుభకార్యాలయాలు జరుపుకొని అద్దె కూడా చెల్లించారు. ప్రస్తుతం ఈ కమ్యూనిటీ భవనం ఆలనా పాలన చూసేవారు లేక, నిర్వహణ లోపంతో నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

విలువైన సామగ్రి మాయం

దుండగులు కమ్యూనిటీ భవనం తాళాలు పగుల గొట్టి అందులోని విలువైన ఫ్యాన్లు, లైట్లు ఎత్తుకెళ్లారు. యుపీవీసీ అద్దాల కిటికీలు అన్ని మాయం చేశారు. వధూవరుల కోసం నిర్మించిన టాయిలెట్లు ధ్వంసం చేశారు. బాత్‌రూం తలుపులు సైతం ఎత్తుకెళ్లారు. దీంతో అధునాతన కమ్యూనిటీ భవనం అంధవికారమైంది. చీకటి వేళల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. కమ్యూనిటీ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా మారడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కమ్యూనిటీ భవనాన్ని వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.

సంకెపల్లి శివారులో ఆటో బోల్తా

- 11మంది మహిళా సంఘం సభ్యులకు గాయాలు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 11: పని నిమిత్తం బ్యాంకుకు వెళ్తొస్తుండగా ఆటో బోల్తా పడి 11మంది మహిళా సంఘం సభ్యులు గాయపడిన ఘటన మంగళవారం వేములవాడ మండలం సంకెపల్లి వద్ద చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాభాష్‌పల్లికి చెందిన మహిళా సంఘం సభ్యులు బ్యాంకు పనుల నిమిత్తం బోయినపల్లి మండలం కొదురుపాకకు ఆటోలో వెళ్లారు. పని పూర్తయిన తర్వాత తిరిగి వస్తుండగా, సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని తప్పించే క్రమంలో సంకెపల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 11మంది మహిళా సంఘం సభ్యులకు గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విష మంగా ఉన్నది. గాయపడిన వారిని 108లో వేములవా డ ఏరియా దవాఖానకు తరలించారు. మహిళా సంఘం సభ్యులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దవాఖాన సిబ్బందికి సూచించారు.

బుగ్గరాజేశ్వరతండా వద్ద మల్కపేట కెనాల్‌లో పూడిక తీస్తున్న బ్లేడ్ బండి

మల్కపేట కెనాల్‌లో పూడికతీత

- నీటి విడుదలకు సన్నాహం
- 'నమస్తే' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11: సాగునీరందక పంటలు ఎండిపోవడం, బోరుబావుల్లో నీళ్లు పడకపోవడంతో నాలుగు రోజులుగా పలు గ్రామాల్లో రైతులు సతమతం అవుతున్నారు. ఈ క్రమంలో బుగ్గరాజేశ్వరతండా, అల్మాస్‌పూర్, కిష్టూనాయక్‌తండా, రాజన్నపేట, దేవునిగుట్టతండా, బాకుర్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. దీంతో మల్కపేట కాల్వ పరీవాహక గ్రామాల్లో సాగునీటి ఎద్దడిపై నమస్తే తెలంగాణలో వరుస కథనాలకు అధికారులు స్పందించారు. సాగునీటి విడుదలకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మంగళవారం బుగ్గరాజేశ్వర తండాలో కాలువ పరిస్థితిని పరిశీలించారు. వెంటనే కాలువలోని పూడికను తొలగించారు. ఈ మేరకు ఈఈ కిశోర్‌ను వివరణ కోరగా, కాల్వలో ఉన్న పూడికను తొలగించి, మల్కపేటలో ఉన్న నీటి సామర్థ్యం మేరకు సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు షూలు పంపిణీ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి11: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 168మంది విద్యార్థులకు మంగళవారం షూలు అందజేశామని ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీరారెడ్డి (రేపాక పాఠశాల టీచర్), సాంబశివుడు (గాలిపెల్లి ప్రభుత్వ పాఠశాల టీచర్), కూనబోయిన వినోద (అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్), రమణారెడ్డి (ఇల్లంతకుంట ప్రభుత్వ పాఠశాల టీచర్) సహకారంతో రూ.50వేల విలువైన షూలు విద్యార్థులకు అందజేశామన్నారు. ఇక్కడ హెచ్‌ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు మహేశ్‌చంద్ర, మధుసూదన్‌రావు, మంజుల, ప్రదీప్‌రెడ్డి, అనిల్, సునీత, పుష్పలత, కవిత, సంపత్ రావు, సత్తయ్య, సుజాత దేవి ఉన్నారు.

వానరానికి వైద్యసేవలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని భీమేశ్వరాలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ మీదపడి కరెంట్ షాక్‌కు గురైన వానరాన్ని స్థానికులు రక్షించారు. ఆలయ క్యాషియర్ గట్టు గౌతమ్, సీనియర్ అసిస్టెంట్ పురాణం వంశీ ఆలయ గోశాల అసిస్టెంట్ వెటర్నరీ సిబ్బందికి ఫోన్‌లో సమాచారం అందించగానే, వెటర్నరీ సిబ్బంది తరుణ్, మణిసాయి హుటాహుటిన అక్కడికి చేరుకుని వానరానికి వైద్యం అందించి కాపాడారు.

జాబితా విడుదల

చందుర్తి, ఫిబ్రవరి 11: ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్ సోమవారం తెలిపారు. గత డిసెంబర్ 31నాటికి నమోదైన ఓటర్ వివరాలతో జాబితాను మండలంలోని 10ఎంపీటీసీ స్థానాల గ్రామ పంచాయతీల పరిధిలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

మురుగు కాల్వలతో దుర్గంధం

జాతర గ్రౌండ్‌లో మురుగు కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ అన్వేశ్, రాజన్న ఆలయ అధికారులు

- ఇబ్బందుల్లో రాజన్న భక్తులు
- పారిశుధ్య చర్యలు చేపట్టాలి: కమిషనర్

వేములవాడ, ఫిబ్రవరి 11: వేములవాడ మున్సిపల్ పరిధిలోని జాతర గ్రౌండ్‌లో మురుగులు పూర్తిగా నిండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రాజన్న భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, రాజన్న ఆలయ అధికారులు మంగళవారం మురుగు కాల్వలను పరిశీలించారు. మహా శివరాత్రి జాతర సమీపిస్తుండడంతో మున్సిపల్, రాజన్న ఆలయ అధికారులు సమన్వయంతో కాలువలో పూర్తిగా నిండిపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇక్కడ ఏఈవో అశోక్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈ రాంకిషన్‌రావు, పర్యవేక్షకులు నర్సయ్య, శ్రీకాంత్‌చారి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ముగ్గురిపై కేసు

ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11: ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. కందికట్కూర్‌కు చెందిన రంగు రజనీకాంత్, మామిండ్ల పరశురాములు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా, ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన కంకణాల సుధాకర్‌పై ఒక నంబర్‌పై ఇసుకను అనుమతి తీసుకుని మరో ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఈ మేరకు సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి: కలెక్టర్

విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గంభీరావుపేట, ఫిబ్రవరి 11: పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. నర్మాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, పాఠశాలలో వసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు గణితం బోధిస్తూ, పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున సమయాన్ని వృథా చేసుకోకుండా కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సృజన ఉన్నారు.

సమయపాలన పాటించాలి

దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ రవీందర్‌రెడ్డి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11: వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పశు వైద్యశాలను పరిశీలించి, మాట్లాడారు. మండలంలో 35గ్రామ పంచాయతీలకు గానూ రెండు పశు వైద్యశాలలు మాత్రమే ఉన్నందున రైతులతో సమన్వయంతో చేసుకుంటూ విధులు నిర్వర్తించాలన్నారు. దవాఖానలో ప్రతి రికార్డు తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఇక్కడ ఇన్‌చార్జి డాక్టర్ ఇందిర, ఎల్ఎస్ఏ శ్రీనివాస్, వీఏ లచ్చయ్య, తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూముల పరిశీలన

ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, అధికారులు

రుద్రంగి, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 428/2, 428/3, 428/4లో గల ప్రభుత్వ భూములను డీఎల్‌పీవో నరేశ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టారు. గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలోని కొందరు కబ్జా చేశారంటూ గ్రామానికి చెందిన పిట్టల నరేశ్ హైకోర్టులో ఫిల్ దాఖలు చేయడంతో సదరు భూమిని డీఎల్‌పీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టారు. అధికారులతో కలిసి సర్వే నిర్వహించి, పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామన్నారు. ఇక్కడ ఎంపీవో సుధాకర్, కార్యదర్శి రాందాస్, నాయకులు గంగం మహేశ్, మంచె రాజేశం, దయ్యాల కమలాకర్, కంటె రెడ్డి, మాడిశెట్టి ఆనందం, చెప్యాల గణేశ్, నంద్యాడపు వెంకటేశ్, ఉప్పులూటి గణేశ్, శ్యామ్, సాదుల్ల, చంద్ర య్య, రాజు, ఉదయ్, నరేశ్, గంగాధర్, గంగారెడ్డి, పెద్దులు, ఉన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపాలి

మాట్లాడుతున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్

కలెక్టరేట్, ఫిబ్రవరి 11: కాటన్ చీరల యజమానులు కార్మికుల కూలి సమస్య పరిష్కరించి.. పనులు కొనసాగించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. కాటన్ చేనేత చీరలు ఉత్పత్తి చేసే కార్మికులతో మంగళవారం సిరిసిల్లలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యజమానులు కార్మికుల కడుపు కొట్టాలని మొండిగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. యజమానుల అహంకారపు చర్యలను సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రెండు, మూడు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. లేదంటే అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వడ్నాల వీరేశం, నల్ల మార్కండేయులు, సంపత్, జక్కని ఆనందం, సత్యం, రాములు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11: తంగళ్లపల్లి మండలంలో 77పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేశామని ఎంపీడీవో లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నిల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను ప్రకటించామన్నారు. మండలంలోని 38,700 మంది ఓటర్లకు గానూ 77పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీటీసి నియోజకవర్గాల వారీగా ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13 లోగా ఫిర్యాదు చేయాలన్నారు. కలెక్టర్ ఆమోదంతో ఈ నెల 15న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఇక్కడ సూపరింటెంట్ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11: జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్‌స్టేషన్ల వివరాలను ఎంపీడీవో సత్తయ్య మంగళవారం వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో అందుకు సంబంధించిన కాపీని ఎంపీవో జోగం రాజుకు అందించారు. ఇక్కడ ఏపీవో కొమురయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

థామస్ అల్వా ఎడిసన్ జయంతి

చందుర్తి, ఫిబ్రవరి 11: సనుగుల ప్రాథమిక పాఠశాలలో శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కట్కూరి ముఖేష్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఇక్కడ టీచర్లు మేకల పద్మ, న్యాతరి నాగమణి, చింతల హరిష్మ, ఎగోళం మాధవి, యాస నవ్య, తదితరులు ఉన్నారు.

బిల్డింగ్ పై అంతస్తు కూల్చివేత

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 11: మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లిలో ఓ భవనం పైఅంతస్తుకు పర్మిషన్ లేకపోవడంతో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. శ్రీమంతుల తిరుమల పేరుతో ఉన్న బిల్డింగ్ పై అంతస్తుకు పర్మిషన్ లేదని ఫిర్యాదుదారుడు కోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఉత్తర్వుల మేరకు బిల్డింగ్ పైన ఉన్న నాలుగో అంతస్తును మున్సిపల్ టీపీవో అన్సార్ అధికారులతో వెళ్లి అగ్నిమాపక సిబ్బంది సహకారంతో కూల్చివేశారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

వేములవాడ, ఫిబ్రవరి 11: ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని బహుజన సేన ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ పేర్కొన్నారు. వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బహుజన సేన ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం పుస్తకాలను అందజేశారు. రాజ్యాంగ ప్రాముఖ్యత, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు అశోక్, అంజయ్య, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు విక్రుతి లక్ష్మీనారాయణ, గుడిసె మనోజ్‌కుమార్, కిశోర్ మూలే, లక్కే సాగర్, జింక శ్రీనివాస్, గుడిసె అరుణ్, జింక శ్రీకాంత్, గణేశ్, బండి రంజిత్, బండి శ్రీకాంత్, నేదూరి రాజు, అలువాల రాము, నేదూరి శ్రీకాంత్, షోయబ్, తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు రాజ్యాంగం పుస్తకాన్ని అందజేస్తున్న నాయకులు

పీహెచ్‌సీలు తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

సిరిసిల్ల రూరల్ : తంగళ్లపల్లిలో ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి రజిత

సిరిసిల్ల టౌన్/సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్, తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ రజిత మంగళవారం తనిఖీ చేశారు. మాతాశిశు ఆరోగ్య సేవలు, ఎన్సీడీ, టీబీ, లెప్రసీ, ఆయుష్మాన్, తదితర కార్యక్రమాలపై వైద్యులతో కలిసి మీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ వైద్యసేవలను ముందువరుసలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశ నోడల్ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సకాలంలో విధులు నిర్వహించి.. ఆరో గ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించాలన్నారు. ఇక్కడ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, సీహెచ్‌వో శాంత, బాలచంద్రం ఉన్నారు.